నూతన భవనం.. ప్రారంభానికి దూరం

- పలుచోట్ల పూర్తయిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలు
- ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిన పనులు
- ప్రారంభానికి చర్యలు చేపట్టని కూటమి నేతలు
- సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న ప్రజలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రాజుపాలెం సచివాలయం

రాజుపాలెం: ప్రజలకు ఉన్న ఊరిలోనే అన్ని సేవలు అందించాలనే తపనతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధన దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసింది. ప్రజలకు సచివాలయాల్లో అన్ని పనులు జరిగేవి. ఇప్పటికి కొన్ని గ్రామాలలో గ్రామ సచివాలయాలు అద్దె భవనాలు, గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో నడుస్తున్నాయి. చాలీచాలని గదులతో ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్లక్ష్యానికి గురవుతున్న భవనాలు

గత ప్రభుత్వం సచివాలయాలకు సొంత భవనాలు ఉండాలని, అలాగే ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలను నిర్మించేందుకు పూనుకుంది. ఆ మేరకు నిధులు కూడా కేటాయించింది. చాలా వరకు నూతన భవనాలను నిర్మించి ప్రారంభించారు. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేక పోవడంతో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అయితే చిన్న చిన్న పనులు మినహా పూర్తయిన భవనాలు కూడా కూటమి ప్రభుత్వంలో ప్రారంభానికి దూరంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా మిగిలిన భవన నిర్మాణలను పట్టించుకున్న దాఖలాలు లేవు. రెడ్డిగూడెం, అనుపాలెం, రాజుపాలెంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని ఓ చిన్న ఇరుకు గదిలో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలో సరైన మౌలిక వసతులు లేక వచ్చిన వృద్ధులు, మహిళలకు అసౌకర్యంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారన్న కారణంతో ఆ భవనాలను నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలో ఇలా...

మండలంలో సుమారు 14 గ్రామ సచివాలయాలకు అనుబంధంగా 13 రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. కొన్నిచోట్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని చోట్ల ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చిన్న చిన్న పనులతో ఆగిపోయాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మిగిలిపోయిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అనుపాలెం ఆర్బీకే


నిర్మాణం ఆగిపోయిన చౌటపాపాయపాలెం వెల్‌నెస్ సెంటర్

వినియోగంలోకి తేవాలి



కూటమి ప్రభుత్వం మిగిలి పోయిన భవనాల నిర్మాణ పనులు చేపట్టి ప్రజల అవసరాలను తీర్చాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. మిగిలిపోయిన వాటిని త్వరగా నిర్మించి వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– బండి కోటినాగిరెడ్డి, మాజీ సర్పంచ్, అనుపాలెం

చర్యలు తీసుకోవాలి



ఎంతో విశాలంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పనులు పూర్తి చేసి కొత్త భవనాలను ప్రారంభించాలి. ప్రజలు సేవలు పొందేందుకు అనుకూలంగా ఉంటుంది. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభోత్సవాలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ఎస్‌కే బాషా, రెడ్డిగూడెం

క్లుప్తంగా

యువత వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకోవాలి

మహాజన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు



పెదకూరపాడు: యువత 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడిచి రాజ్యాధికారం సాధించాలని, వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకోవాలని మహాజన్ సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు కోరారు. మండలంలోని పాడపాడు గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను జాన్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు వేమవరపు జీవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని వర్గీకరణ ఫలాలను అనుభవించినప్పుడే ఉద్యమ నాయకత్వానికి సంతృప్తి ఉంటుందన్నారు. గ్రామ కమిటీ సభ్యులు కఠారి అశోక్, మాచర్ల నాగరాజు, చాట్ల అశోక్, చాట్ల చంద్రశేఖర్, రాజేష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదలలో ఉచిత వైద్య శిబిరం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో సత్తెనపల్లికి చెందిన సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు సింగరాజు సాయికృష్ణ, సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఆకుల శివప్రసాద్ పాల్గొని వైద్య సేవలందించారు. మొత్తం 250 మందికి వైద్య సేవలందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి బసవయ్య, వైస్ ఎంపీపీ రావిపాటి మదుబాబు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, గోపి, కామేపల్లి శ్రీనివాసరావు, తొరటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ వైస్ ఎంపీపీ మారూరి రామలింగారెడ్డి, కళ్ళం శివరామిరెడ్డి, చావ రమేష్, బద్దిగం సాయికిరణ్‌రెడ్డి, అన్నపురెడ్డి శివారెడ్డి, శ్యామల అర్జున్‌రెడ్డి, కోట్ల శివారెడ్డి, బద్దిగం రాజగోపాల్‌రెడ్డి, కొమ్మారెడ్డి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారికి సన్మానం



క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు ఎస్సీ కాలనీ నుంచి డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన ముగ్గురిని ఆదివారం ఏఈఎల్ చర్చిలో ప్రత్యేకంగా సన్మానించారు. డీఎస్సీలో ఎంపికైన చిలకా శ్యామ్యూల్ మోరిస్, కంభంపాటి దానియేల్, చిలకా శ్యాంతారావు మోరిస్‌ను ఘనంగా సత్కరించారు. చిలాకా శ్యామ్యూల్ డీఎస్సీలో ఎస్ఏ, టీజీటీ, ఏజీటీ పోస్టులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా అతని తండ్రి శ్యాంతారావు మోరిస్ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. వీరితో పాటు కంభంపాటి దానియేల్ డీఎస్సీలో ఎస్జీటీ పోస్టు సాధించారు. ఈ సందర్భంగా చర్చి పెద్దలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఫొటోగ్రాఫర్లకు సన్మానం

వినుకొండ: ఆర్ట్ ఫొటోగ్రఫీ వంటి కళలో అంతర్జాతీయంగా రాణిస్తున్న వినుకొండ ఫొటోగ్రాఫర్లను రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏరువ వెంకట నారాయణ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు పోటీలకు వెళ్లడానికి అవసరమైన ప్రాథమిక వసతులను సమకూర్చడానికి క్లబ్ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన ఫొటోగ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మయ్య, కేసనపల్లి సుబ్బారావు, ఫొటోగ్రాఫర్లు కోకా సుబ్బారావు, పాపగంటి వినీల్, గోళ్ల మల్లికార్జునలను ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ, కోశాధికారి పాత్తూరి నవీన్, క్లబ్ జిల్లా ముఖ్యులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు పొందాలి

తహసీల్దార్ వి.వి.నాగరాజు



క్రోసూరు: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు పొందాలని తహసీల్దార్ వి.వి.నాగరాజు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. గణేష్ మండపాల అనుమతులు పరిశీలించేందుకు ప్రభుత్వం ఐదుగురు అధికారులతో కమిటీ వేసిందని, అందులో తహసీల్దార్ నోడల్ అధికారిగా, ఎస్ఐ, ఎంపీడీవో, ఫైర్, ఎలక్ట్రికల్ అధికారులు సభ్యులుగా ఉంటారని అన్నారు. వినాయక ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా విగ్రహాల ఏర్పాటుకు, నిమజ్జనానికి అనుమతులు పొందాలన్నారు. డీజేలకు అనుమతులు ప్రత్యేక ప్రదేశాలలో నిషేధించబడినట్లు చెప్పారు. వినాయకచవితి–25 పేరుతో పరిశీలన అధికారులు వాట్సాప్ గ్రూపులో అందుబాటులో ఉంటారని తెలిపారు. వినాయక మండపాల వద్ద 200 లీటర్ల నీటిని సిద్ధంగా ఉంచాలని, మట్టి విగ్రహాలను పెట్టుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ కోరారు. ప్రభుత్వం ప్రకటించిన నోడల్ అధికారులు వినాయక విగ్రహాల మండపాలను సందర్శించటం జరుగుతుందని తెలిపారు.

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలి



పెదకూరపాడు: పర్యావరణాన్ని పరిరక్షించేలా మట్టి గణపతిని పూజించాలని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. 75 తాళ్లూరు మాజీ ఎంపీటీసీ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయన్నారు. జన చైతన్య సమితి నిర్వాహకులు షేక్ లియాకత్ అలీ మాట్లాడుతూ చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఒంటిపులి అంకమ్మరావు, బెజ్జం నాగేశ్వరరావు, బొంత బుజ్జిబాబు, శ్రీ పాద రామకోటిరెడ్డి, మాచర్ల జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. ఆదివారం నాడు రాహు-కేతువులను ప్రసన్నం చేసుకుంటే దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ మేరకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు దోష నివారణకు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. విశేష పూజల అనంతరం స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

బంగారం వ్యాపారి ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: బంగారం వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని సంగం బజార్‌లో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లో శ్రీలక్ష్మి శ్రీనివాస బంగారు షాప్ యజమాని రామకృష్ణ (రాము) సంగం బజార్‌లోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నివసిస్తున్నాడు. గోల్డ్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న గుజరాత్ టూర్‌కి వెళ్లాడు. టూర్ నుంచి తిరిగి ఆదివారం వచ్చిన ఆయన ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు తీసి ఉండడం, లాకర్ పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంట్లో పరిశీలించగా రూ.2 లక్షలు విలువచేసే 20 గ్రాముల బంగారం, రూ.లక్ష విలువ చేసే కేజీ వెండి అపహరించుకుపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

నరసరావుపేట టౌన్: మహిళపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలానికి చెందిన సాతులూరి రెబ్కా భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలతో కలిసి రామిరెడ్డిపేటలో ఉంటూ చీరల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుంది. ఈ క్రమంలో క్రిస్టియన్ పాలెంకు చెందిన చాట్ల సూర్య ప్రకాష్‌తో ఐదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత మూడు సంవత్సరాలు ఇద్దరూ సహజీవనం చేశారు. గత రెండేళ్ల నుంచి సూర్య ప్రకాష్ తరుచూ తిడుతూ, కొడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో రెబ్కా అతనికి దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా రెబ్కా ఉన్న సమయంలో సూర్య ప్రకాష్ వచ్చి ఆమెపై దాడికి పాల్పడటంతో ఎడమ కంటి భాగంపై రక్తగాయం అయ్యింది.

ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గం

క్రోసూరు: రైతు ప్రయోజనాల కొరకు టీడీపీ పాటుపడుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, శాసనమండలి చైర్మన్ ఎండీ షరీఫ్, జనసేన నాయకులు గాదె వెంకట్రావు, మాజీ మంత్రి కె.జవహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాలకవర్గ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఉండగా చైర్మన్‌గా షేక్ జరీనా, వైస్ చైర్మన్‌గా రాయుడి సాంబశివరావు, సభ్యులుగా షేక్ మస్తాన్‌వలి, చల్లా అనుపమకళ, మర్రి భూలక్ష్మీ, దుద్దుల యోహాను, నూనావత్ నాగమణిబాయి, పత్తి కోమలి, మాదాసు అప్పారావు, మండాడి నారాయణ, ఏరువ శౌరీలమ్మ, యండవల్లి కిరణ్‌మయి, గుమ్మడిపల్లి వెంకటేశ్వరరావు, సొంగా కల్యాణి, దుప్పటి బాలకృష్ణ, క్రోసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, క్రోసూరు సర్పంచ్, జిల్లా మార్కెట్‌టింగ్ అధికారి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి మార్కెట్‌యార్డు కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

స్వర్ణోత్సవ సంబరాలకు పూర్వ విద్యార్థులు సమాయత్తం



సత్తెనపల్లి: స్వర్ణోత్సవ సంబరాలకు పూర్వ విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. పూర్వ విద్యార్థుల కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన పట్టణంలో సభ్యులు ఆదివారం సమాయత్త సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ 10వ తరగతి 150 మంది విద్యార్థులు ఇప్పటికే రెండు పర్యాయాలు సమావేశమయ్యారు. 3వ సమావేశం స్వర్ణోత్సవ సంబరాలను డిసెంబర్ 14న నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు నిధుల సేకరణ, మరోసారి సమాయత్త సమావేశానికి తీర్మానించారు. ఈ సందర్భంగా మట్టా సింహాచలం రూ.15,116, కొప్పురావూరి పెద్ద కనకయ్య రూ.11,116, జక్కుల లక్ష్మీనారాయణ రూ.10,116, తాళ్లూరి మల్లికార్జునరావు రూ.10,116, జవ్వాజి కనకదుర్గారావు రూ.5,116, కొప్పురావూరి చిన్న కనకయ్య రూ.5,116, షేక్ ఇబ్రహీం రూ.5,116, అన్నం లక్ష్మణకుమార్ రూ.3,116 అందిస్తామని ప్రకటించారు. కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొప్పురావూరి చిన్న కనకయ్య, సభ్యులు పాల్గొన్నారు.

• రోడ్డును ఆక్రమించిన కంప..!



నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో పాముల కాలనీ, ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే సిమెంటు రోడ్డు పూర్తిగా పిచ్చి, ముళ్ల కంప చెట్లతో నిండిపోయింది. దీంతో రోడ్డు కుంచించుకుపోయి ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అటుగా వెళ్లే వాహనదారుల చర్మాలు కంపలు గుచ్చుకుని చీలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పిచ్చి కంపను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– పెదకూరపాడు

• తప్పని నిరీక్షణ.. మహిళల వేదన


సత్తెనపల్లిలోని అచ్చంపేట పాయింట్‌లో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలకు ఎట్టకేలకు అమలకు పూనుకుంది. స్త్రీ శక్తిపై విజయోత్సవ సభలు పెట్టి ఊదరగొట్టడం, ప్రతిపక్షాన్ని విమర్శించడం తప్ప అసలు కూటమి నేతల్లో మార్పు కనిపించడం లేదు. అరకొర బస్సులు, బస్టాండ్‌లో అధ్వాన పరిస్థితులను పట్టించుకోకుండా ప్రారంభించేశామంటూ గొప్పలు చెప్పడాన్ని మహిళలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సరిపడా బస్సులు లేక మహిళలు నిరీక్షించాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఇప్పటికైనా మహిళలకు సరిపడా బస్సులు కేటాయించడంతో పాటు బస్టాండ్‌లో అత్యవసరానికి పరుగులు తీయకుండా చూడాలని మహిళలు కోరుతున్నారు.

తల్లి ప్రేమకు సరిసాటి తెలుగు భాష

సరస్వతి శిశుమందిర్‌లో ఆలోచింపజేసిన అష్టావధానం


అష్టాధానంను ఆసక్తిగా వింటున్న పుర ప్రజలు


అష్టాధానంలో బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ, తదితరులు

సత్తెనపల్లి: తల్లి ప్రేమకు సరిసాటిగా భాసిల్లిన తెలుగు భాషను ఎందరో సుసంపన్నం చేశారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో అష్టావధాన కార్యక్రమం పట్టణంలోని సరస్వతి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగింది. అష్టావధానంలో సంచాలకులు బ్రహ్మశ్రీ పోలూరి వెంకటశివరామప్రసాదరావు, నిషిద్ధక్షరిగా విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, దత్తపదిగా శ్రీమంత్రిరాజు శివరామయ్య, సమస్యగా డాక్టర్ నారాయణం వెంకట రాంబాబు, వర్ణనగా డాక్టర్ కాసులనాటి నాగరాజ శర్మ, ఆశువుగా డాక్టర్ కె.వెంకట కోటయ్య, పురాణ పఠనంగా రిటైర్డ్ తెలుగు పండితుడు, ప్రభుత్వ సాహితీ పురస్కార గ్రహీత మంచికంటి వెంకటేశ్వరరావు, అప్రస్తుత ప్రసంగంగా ఈదుమూడి ఆంజనేయులు, చందోభాషణంగా అవధాన సుధాకర, శ్రీనారాయణం బాల సుబ్రమణ్యంలు వ్యవహరించి అష్టావధానంను మాతృభాష తెలుగులోని అమృత పదములతో జన రంజకంగా ఆలోచింపజేశారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష రుచిని చూపించారు.

ముందుగా స్వామి వివేకానంద చైతన్య భారతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అష్టావధానంలో పాల్గొన్న వారిని చిరు సత్కారంతో ఆహ్వానించారు. సంస్థ సభ్యుడు జేపీఎస్ శాస్త్రి అష్టావధానం నిర్వహిస్తున్న 19 సంవత్సరాలకే 87 అష్టావధానములు, 3 శతావధానములు నిర్వహించిన బాల భాస్కర, అవధాన బాల సరస్వతి, అవధాన కళామార్తాండ, శతావధాన తిలక బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ పరిచయంతో మొదలైంది. ఈ సందర్భంగా విద్యాభారతి సమితి స్థాయి ఆటల పోటీల నిర్వహణలో తమ సేవలను అందించిన పీడీ దాసరి కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీ విశ్వనాథం, సెక్రటరీ కాకాని శ్రీనివాసరావు, కోశాధికారి తొమ్మండ్రు సత్యనారాయణ, సభ్యులు డాక్టర్ సుధాకర్, అబ్బూరి సత్యనారాయణ, చలువాది చిన్నసత్యనారాయణ, ఎంవీ సుబ్బారెడ్డి, దేవరశెట్టి రవికుమార్, అన్నం మురళి, దేసు శేఖర్, కె.రత్తయ్య, దూపుగుంట్ల పూర్ణ, పి.రామకోటేశ్వరరావు, వేదాద్రి, పట్టణ ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే యువతకు మంచి జీవితం



అచ్చంపేట: విద్యాభివృద్ధితోనే యువత మంచి జీవితం సాధ్యపడుతుందని, అందుకు ప్రతిభ కలిగిన విద్యార్థులకు చేయూతనిచ్చి వారి భవిష్యత్‌కు బంగారుబాట వేసే లక్ష్యంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ పనిచేస్తున్నదని ఆ సంస్థ ఫౌండర్ కూరపాటి శివరాం అన్నారు. ఆదివారం ఆయన అచ్చంపేటలో బీ ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని లక్ష్మికి కాలేజి ఫీజు నిమిత్తం రూ.65,000 చెక్కును అందచేశారు. తమ సంస్థ ద్వారా గత మూడేళ్లుగా ఏడాదికి రూ.65,000 చెక్కును ఇస్తున్నామని, ఆదే విధంగా ఈ ఏడాది కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను చేయూతనివ్వడం ద్వారా వారి భవిష్యత్‌కు బాటలు వేసినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.